క్లుప్తంగా

నేడు వైఎస్సార్ సీపీ ముఖ్యకార్యకర్తల సమావేశం

పెనుగంచిప్రోలు(వత్సవాయి): ఈ నెల 24న జగ్గయ్యపేటలో సామాజిక సాధికార బస్సు యాత్ర జరుగనున్న నేపథ్యంలో సోమవారం వైఎస్సార్ సీపీ పెనుగంచిప్రోలు మండల ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు మండల పార్టీ అధ్యక్షులు కనకపుడి భాస్కరరావు ఆదివారం తెలిపారు. మధ్యాహ్నం మూడు గంటలకు పెనుగంచిప్రోలులోని తంబరేణి కల్యాణమండపంలో జరిగే ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే సామినేని ఉదయభాను పాల్గొంటారని చెప్పారు. సర్పంచులు, ఎంపీటీసీలు, గ్రామ పార్టీ అధ్యక్షులు, సచివాలయ కన్వీనర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని కోరారు.

శ్రీలక్ష్మీతిరుపతమ్మకు ప్రత్యేకాలంకరణ



పెనుగంచిప్రోలు(జగ్గయ్యపేట): గ్రామంలో వేంచేసియున్న శ్రీలక్ష్మీతిరుపతమ్మ అమ్మవారికి కార్తీకమాసం సందర్భంగా ఆదివారం అర్చకులు విశేషాలంకరణ చేశారు. బేవరేజెస్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ దొంతిరెడ్డి వాసుదేవరెడ్డి సహకారంతో అమ్మవారికి పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. కార్తీక మాసం సందర్భంగా పెద్దసంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూలజు చేశారు. ఆలయ ఈవో రమేష్‌నాయుడు భక్తులకు ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక చర్యలు తీసుకున్నారు.

నేడు ఆర్డీవో కార్యాలయంలో స్పందన కార్యక్రమం

నందిగామ: పట్టణంలోని ఆర్డీవో కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం జరుగుతుందని ఆర్డీవో పి.సాయిబాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తామన్నారు. ప్రభుత్వం ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు స్పందన కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని వివరించారు. డివిజన్ పరిధిలోని మండలాల ప్రజలు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలి



నందిగామ:రౌడీ షీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలని ఇన్‌స్పెక్టర్ హనీష్ హెచ్చరించారు. పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లకు ఆదివారం కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ హనీష్ మాట్లాడుతూ రౌడీ షీటర్లు అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే ఉపేక్షించేది లేదన్నారు. ప్రతి రౌడీషీటర్‌పై ప్రత్యేక నిఘా ఉందన్నారు. ప్రతి రౌడీషీటర్ ఎప్పుడు ఏం చేసేది కూడా గమనిస్తూనే ఉన్నామని, కాబట్టి సత్ప్రవర్తనతో మెలగాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్సై పండు దొర , సిబ్బంది పాల్గొన్నారు.

పశుపోషణపై అవగాహన



వేములనర్వ(వత్సవాయి) : రైతులు వ్యవసాయంతోపాటు పశుపోషణపై కూడా దృష్టిసారించాలని కృష్ణా మిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు సూచించారు. వేములనర్వ గ్రామంలో మహిళా పాల ఉత్పత్తిదారుల పరస్పర సహాయక సహకార సంఘం ఆధ్వర్యంలో పశుపోషణ–ఉత్తమ యాజమాన్య పద్ధతులపై ఆదివారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ రైతులు వ్యవసాయంతోపాటు పశుపోషణ చేస్తే లాభసాటిగా ఉంటుందన్నారు. గృహావసరాలకు మహిళలు పశుపోషణ ద్వారా ఆదాయాన్ని పొందవచ్చన్నారు. పాల ఉత్పత్తిదారులకు పాల క్యాన్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సభ్యులు ఇంజం రామారావు, మేనేజర్ వీరమాచినేని విజయసంపత్, పాలకేంద్రం అధ్యక్షురాలు వాసిరెడ్డి నిర్మల పాల్గొన్నారు.

ముందస్తు జాగ్రత్తలతో బ్రెయిన్‌స్ట్రోక్ నివారణ

తిరువూరు: సిగరెట్, మద్యపానం వంటి చెడు అలవాట్లకు లోనుకాకుండా, మానసిక ఒత్తిడిని అధిగమిస్తూ ముందస్తు వైద్యపరీక్షలు చేయించుకుంటే బ్రెయిన్ స్ట్రోక్ రాకుండా జాగ్రత్త పడవచ్చని ప్రముఖ న్యూరాలజిస్ట్ రాజేశ్వరి సూచించారు. స్థానిక సుందరయ్య భవన్‌లో జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఆదివారం 'బ్రెయిన్ స్ట్రోక్–నివారణ చర్యలు' అనే అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. తరచూ అనారోగ్యానికి గురవుతున్నా, తల తిరుగుతున్నట్లున్నా వైద్యులను సంప్రదించి పూర్తిస్థాయి వైద్యపరీక్షలు చేయించుకోవాలన్నారు. తగిన సమయంలో వైద్యసేవలు పొందితే బ్రెయిన్ స్ట్రోక్ నియంత్రించవచ్చని పేర్కొన్నారు. రవీంద్ర, సుధాకర్ పాల్గొన్నారు.

క్రికెట్ అభిమానుల సందడి



నందిగామ జెడ్పీ స్కూల్ ఆవరణలో ఏర్పాటు చేసిన బిగ్ స్క్రీన్‌పై క్రికెట్ మ్యాచ్‌ను తిలకిస్తున్న అభిమానులు



నందిగామలో క్రికెట్ అభిమానులతో కలిసి ఫైనల్ మ్యాచ్‌ను వీక్షిస్తున్న ఎమ్మెల్సీ డాక్టర్ అరుణ్‌కుమార్

- ఫైనల్ మ్యాచ్‌కు భారీ స్క్రీన్ ఏర్పాటు
- అభిమానులతో కలసి మ్యాచ్ వీక్షించిన ఎమ్మెల్సీ అరుణ్‌కుమార్

నందిగామ టౌన్: భారత్–ఆస్ట్రేలియా వరల్డ్ కప్ ఫైనల్ మ్యాచ్ సందర్భంగా నందిగామలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో సందడి వాతావరణం నెలకొంది. ఫైనల్ మ్యాచ్‌ను పురస్కరించుకుని ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణ్ కుమార్ భారీ స్క్రీన్ ఏర్పాటు చేయడంతో క్రీడాభిమానులు పెద్ద సంఖ్యలో మ్యాచ్‌ను వీక్షించారు. వందల సంఖ్యలో ఉన్న క్రీడాభిమానుల కేరింతలతో పాఠశాల ఆవరణ దద్దరిల్లింది. క్రికెట్ అభిమానుల కోసం మంచినీటి సదుపాయంతోపాటు మ్యాచ్‌ను వీక్షించేందుకు ఇబ్బందిపడకుండా టెంట్లు సైతం ఏర్పాటు చేశారు. క్రీడాభిమానులతో కలిసి ఎమ్మెల్సీ అరుణ్‌కుమార్ మ్యాచ్‌ను తిలకించారు. ఈ సందర్భంగా సంఘటనలు అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా సీఐ హనీష్ పటిష్ట బందోబస్తు చర్యలు తీసుకున్నారు. ఎమ్మెల్సీ వెంట నాయకులు షేక్ కరిముల్లా, తానూరి రాము, విశ్వనాథపల్లి కృపారావు ఉన్నారు.



సందడి చేస్తున్న చిన్నారులు

విద్యార్థులకు ముగ్గుల పోటీలు



పేటలో ముగ్గుల పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు



కంచికచర్లలో ముగ్గుల పోటీలను పర్యవేక్షిస్తున్న నిర్వాహకులు

జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలోని జిల్లా గ్రేడ్–1 శాఖా గ్రంథాలయంలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ఉత్సాహంగా కొనసాగుతున్నాయి. వారోత్సవాల్లో భాగంగా ఆరో రోజు ఆదివారం విద్యార్థులకు స్థానిక చిల్డ్రన్స్ పార్కులో ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు పట్టణంలోని ఆయా పాఠశాలలకు చెందని విద్యార్థులు హాజరై అందమైన రంగవల్లులను తీర్చిదిద్దారు. సాయంత్రం గ్రంథాలయంలో నిర్వహించిన సాహితీ కార్యక్రమంలో 'శ్రీశ్రీ కవిత్వం–ఒక పరిశీలన' అనే అంశంపై కవి దోసపాటి నాగేశ్వరరావు ఉపన్యసించారు. అనంతరం నిర్వాహకులు ఆయనను దుశ్శాలువాతో సత్కరించారు. గ్రంథాలయాధికారి ఆలేటి ప్రభ, బీడీసీ నాగమల్లిక, సిబ్బంది సత్యావతి సిబ్బంది, పాఠకులు పాల్గొన్నారు.

నందిగామలో..

నందిగామ: పట్టణంలోని గ్రంథాలయంలో నిర్వహిస్తున్న జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా ఆదివారం విద్యార్థులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. విద్యార్థులు ఈ పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. ముందుగా మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతిని పురస్కరించుకుని ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పోటీలను గ్రంథాలయ అధికారి షేక్ మస్తాన్‌వలి పర్యవేక్షించారు.

కంచికచర్లలో..

కంచికచర్ల (వీరులపాడు) : జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా ఆరోరోజు ఆదివారం స్థానిక కంచికచర్ల శాఖా గ్రంథాలయం ఆధ్వర్యంలో విద్యార్థులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు 34మంది విద్యార్థులు హాజరయ్యారు. తొలుత మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతిని పురస్కరించుకుని ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా గ్రంథపాలకుడు అల్లూరు రామచంద్రుడు మాట్లాడుతూ విద్యార్థులు గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకుని, బంగారు భవితకు బాటలు వేసుకోవాలని సూచించారు. ఆయా పోటీల్లో గెలుపొందిన విజేతలకు సోమవారం బహుమతులు అందజేస్తామని తెలిపారు. మాజీ గ్రంథపాలకుడు రంగిశెట్టి రంగారావు, తెలుగు ఉపాధ్యాయుడు షేక్ ఇస్మాయేల్, జిల్లి కారల్‌మార్క్స్, ఎం.కనకారావు, బీడీసీలు శ్రీనివాసరావు, పేరయ్య, వరలక్ష్మి, నాగరాణి, శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

నేడు 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమాలు

జగ్గయ్యపేట అర్బన్: రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాలు సోమవారం జగ్గయ్యపేట పట్టణంతోపాటు నియోజకవర్గంలోని మూడు మండలాల్లోని సచివాలయాల వద్ద నిర్వహించనున్నట్లు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను కార్యాలయం ఆదివారం ఒక ప్రకటన ద్వారా తెలిపింది. మధ్యాహ్నం మూడు గంటలకు జగ్గయ్యపేట పట్టణంలోని 14వ సచివాలయం పరిధిలోని డీవీఆర్‌నగర్, జగ్గయ్యపేట మండలంలోని ముక్త్యాల గ్రామం, వత్సవాయి మండలం, మంగొల్లు–2 (దేచుపాలెం), పెనుగంచిప్రోలు–2 సచివాలయం, నందిగామ మండలంలోని సోమవరం గ్రామంలో నిర్వహించే కార్యక్రమంలో అందరూ పాల్గొనాలని ఆ ప్రకటనలో కోరారు.

80 మందికి వైద్యపరీక్షలు

నందిగామ: పట్టణంలో సత్యసాయి 98వ జయంతి కార్యక్రమాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి.ఐదు రోజులపాటు నిర్వహించే ఈ కార్యక్రమాల్లో భాగంగా మొదటిరోజు ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో డాక్టర్ శ్రీకాంత్ పాల్గొని 80మందికి వైద్య పరీక్షలు చేసి, అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. ఆయా కార్యక్రమాల్లో పెద్దసంఖ్యలో సత్యసాయి భక్తులు పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణకు చర్యలు కోరుతూ వినతిపత్రం

నందిగామ: పట్టణ పరిధిలో ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని కోరుతూ పలువురు న్యాయవాదులు పట్టణ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ హనీష్‌కు ఆదివారం వినతిపత్రం అందజేశారు. పట్టణ పరిధిలో జాతీయ రహదారితోపాటు పలు ప్రధాన రహదారుల వెంట నిర్లక్ష్యంగా వాహనాలు నిలుపుదల చేయడం, ఆయా ప్రాంతాలు కొన్నిచోట్ల ఆక్రమణలకు గురికావడంతో తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని న్యాయవాదులు వివరించారు. ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో న్యాయవాదులు ఎక్కిరాల హనుమంతరావు, కాట్రగడ్డ రవికుమార్, దారెల్లి అరుణ్ కుమార్, షేక్ ఆజాద్, కృష్ణ ప్రసాద్ ఉన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం



సత్యనారాయణ వ్రతంలో పాల్గొన్న భక్తులు



విద్యుత్ దీపాల అలంకరణలో శ్రీనాగలక్ష్మి అమ్మవారి ఆలయం

జగ్గయ్యపేట అర్బన్ : పట్టణంలోని రైల్వేకట్ట సమీపంలో స్వయంభుగా వెలసిన శ్రీనాగలక్ష్మి అమ్మవారి ఆలయం 35వ వార్షికోత్సవ వేడుకలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా ఆదివారం ఆలయానికి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు చేశారు. పాలు పొంగళ్లు పొంగించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ అర్చకులు మూర్తి సాంబశివ శాస్త్రి ఆధ్వర్యంలో ఆలయ ప్రాంగణంలో సత్యనారాయణవ్రతాన్ని నిర్వహించారు. పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొని వ్రతాన్ని ఆచరించారు. ఆలయ ప్రైవేటు ఇంప్రూవ్‌మెంట్ కమిటీ సభ్యులు పాల్గొని ఏర్పాట్లను పర్యవేక్షించారు.

30ఏళ్ల మురుగు సమస్యకు పరిష్కారం



డ్రైయిన్ నిర్మించక ముందు అన్నవరంలో రహదారిపై మురుగునీరు(ఫైల్)



ప్రధాన రహదారిలో రూ.16లక్షలతో నిర్మించిన డ్రైయిన్

- చొరవ చూపిన విప్ ఉదయభాను
- రూ.20లక్షలతో డ్రైనేజీల నిర్మాణం
- హర్షం వ్యక్తంచేస్తున్న అన్నవరంవాసులు

అన్నవరం(జగ్గయ్యపేట): తెలంగాణ రాష్ట్రం సరిహద్దున మారుమూలగా ఉన్న జగ్గయ్యపేట మండలంలోని అన్నవరం గ్రామంలో 30ఏళ్లుగా అపరిష్కృతంగా ఉన్న డ్రైనేజీ సమస్యకు 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంతో విముక్తి లభించింది. ఎన్నో ఏళ్లుగా సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని పాలకులను కోరినా పట్టించుకోకపోవడంతో తీవ్ర నిరాశకు గురైన గ్రామస్తులు, జగ్గయ్యపేట ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను చొరవతో సమస్య పరిష్కారానికి నోచుకోవడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

చెరువును తలపిస్తున్న రోడ్డు..

అన్నవరం గ్రామంలో ప్రధాన రహదారి ఆంజనేయస్వామి విగ్రహం నుంచి పాలేటి ఉపనది బిడ్జి వరకు రహదారి ఉన్నప్పటికీ డ్రైనేజీ వసతి లేకపోవడంతో రోడ్డుకు ఇరువైపులా ఉండే గృహాల్లో వినియోగించే నీరంతా రోడ్డుపైకి చేరుతోంది. దీంతో రోడ్డంగా చెరువును తలపిస్తూ రాకపోకలకు తీవ్ర అవరోధం ఏర్పడుతోంది. నిత్యం మురుగు నీరు నిల్వ ఉంటుండటంతో దోమల ఉధృతి కూడా పెరిగి గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో సమస్యను పలుమార్లును పాలకుల దృష్టికి తీసుకువెళ్లినా పట్టించుకోలేదని గ్రామస్తుల చెబుతున్నారు.

యుద్ధప్రాతిపదికన డ్రైనేజీ నిర్మాణం..

ఇటీవల అన్నవరం గ్రామంలో ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను ఆధ్వర్యంలో గడపగడపకు మనప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించగా, మూడు దశాబ్దాల నుంచి ప్రధాన రహదారిపై మురుగునీటి సమస్యతో ఇబ్బందులు పడుతున్న వైనాన్ని గ్రామస్తులు ఆయన దృష్టికి తెచ్చారు. స్పందించిన సామినేని ఉదయభాను వెంటనే రూ.20లక్షలు మంజూరు చేయించి యుద్ధప్రాతిపదికన డ్రెయిన్ నిర్మాణం పనులు చేపట్టారు. ప్రస్తుతం పనులు తుదిదశకు చేరాయి. గ్రామంలోని ఆంజనేయస్వామి విగ్రహం నుంచి పాలేటి నది వరకు రూ.16లక్షలు, ఎస్సీకాలనీలో రైతుభరోసా కేంద్రం నుంచి మెయిన్ డ్రైయిన్ వరకు రూ.3లక్షలతో డ్రైనేజీల నిర్మాణంతోపాటు మరో రూ.లక్షతో కల్వర్టు నిర్మాణం చేపట్టారు. దీంతో డ్రైనేజీ సమస్య పరిష్కారమైంది. ఏళ్లనాటి సమస్యను 'గడపగడపకు మనప్రభుత్వం' కార్యక్రమం ద్వారా పరిష్కరించారంటూ గ్రామస్తులు హర్షం వ్యక్తంచేస్తున్నారు. సమస్య పరిష్కారానికి చొరవ చూపిన ప్రభుత్వ విప్ సామినేని ఉదయభానుకు కృతజ్ఞతలు తెలియజేశారు.

సమస్యను పరిష్కరించారు..



గ్రామంలోని ప్రధాన రహదారికి డ్రైనేజీ వసతి లేకపోవడంతో 30ఏళ్లుగా ఇబ్బందిపడుతున్నాం. వర్షకాలంలో అవస్థలు అన్నీఇన్నీ కావు. రూ.20లక్షలతో డ్రైనేజీల నిర్మాణం చేపట్టడంతో సమస్యకు పరిష్కారం లభించినట్లైంది.

దాచేపల్లి వైకుంఠం

వైఎస్సార్ సీపీలోకి 60 కుటుంబాలు

- టీడీపీని వీడిన పలువురు నాయకులు
- కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించిన ఎమ్మెల్సీ అరుణ్‌కుమార్

నందిగామ టౌన్ : సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమ, పారదర్శక పాలనకు ప్రతిపక్ష టీడీపీ నాయకులు, కార్యకర్తలు సైతం ఆకర్షితులవుతున్నారని ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణ్ కుమార్ పేర్కొన్నారు. వీరులపాడు మండలం జుజ్జూరు గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు తమ్మిశెట్టి కొండలరావు, దండా నవీన్ కుమార్, ఆటో యూనియన్ మండల అధ్యక్షుడు తమ్మిశెట్టి బుజ్జిలతోపాటు మరో 60 కుటుంబాలు ఆదివారం స్థానిక ఎమ్మెల్సీ నివాసంలో టీడీపీని వీడి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారికి ఎమ్మెల్సీ అరుణ్‌కుమార్ పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా అరుణ్‌కుమార్ మాట్లాడుతూ గత ముఖ్యమంత్రులకు భిన్నంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని కొనియాడారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో సముచిత స్థానం కల్పించారని ఆయన గుర్తుచేశారు. అనేక కేబినేట్ మంత్రి పదవులతోపాటు ఉప ముఖ్యమంత్రి పదవిని సైతం కట్టబెట్టిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. ముఖ్యంగా నాటి టీడీపీ ఐదేళ్ల పాలనలో పారిశ్రామికవేత్తలు, బడాబాబులకు కొమ్ముకాస్తే, నేడు సీఎం జగన్ మోహన్‌రెడ్డి మాత్రం నిరుపేదల పక్షాన నిలిచి వారి ఆర్థికాభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారని చెప్పారు. సంక్షేమ పథకాలు రూపొందించడమే కాదు సమర్థవంతంగా అమలు చేసి ప్రజల మన్ననలు పొందుతున్నారని వివరించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి కృషి చేసే వారికి పార్టీ సముచిత స్థానం కల్పిస్తుందన్నారు. కొత్తగా చేరిన వారితో పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి పార్టీ విజయానికి కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ పూలా రాంబాబు, గ్రామ కన్వీనర్ పూలా పుల్లయ్య, నాయకులు షేక్ ఫయాజ్, రమావత్ రాము, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్సీ డాక్టర్ అరుణ్‌కుమార్

గ్రూప్–2 సిలబస్‌పై అవగాహన సదస్సు రేపు



మాట్లాడుతున్న యూటీఎఫ్ జిల్లా సహాధ్యక్షులు ఎం. కృష్ణయ్య

జగ్గయ్యపేట అర్బన్: ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్(యూటీఎఫ్) జగ్గయ్యపేట మండల శాఖ ఆధ్వర్యంలో ఈనెల 21వ తేదీన గ్రూప్–2 పరీక్షల నూతన సిలబస్‌పై అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు యూటీఎఫ్ జిల్లా సహాధ్యక్షులు ఎం. కృష్ణయ్య తెలిపారు. స్థానిక టీచర్స్ కోపరేటివ్ సొసైటీ భవన్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కృష్ణయ్య మాట్లాడుతూ ఎస్‌జీఎస్ కళాశాలలో నిర్వహించే ఈ సదస్సుకు కృష్ణా–గుంటూరు జిల్లాల గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు హాజరై అభ్యర్థులకు గ్రూప్–2 నూతన సిలబస్‌పై అవగాహన కల్పిస్తారని చెప్పారు. జగ్గయ్యపేట నియోజకవర్గ పరిధిలో గ్రూప్–2 పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులు, నిరుద్యోగయువత ఈ సదస్సుకు హాజరుకావాలని కోరారు. ఈ కార్యక్రమానికి ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను ముఖ్యఅతిథిగా హాజరుకానున్నట్లు చెప్పారు. సదస్సుకు హాజరైన అభ్యర్థులకు 120 పేజీల స్టడీ మెటీరియల్ ఉచితంగా అందజేయనున్నట్లు యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి జె.సుధానంద్ తెలిపారు. కార్యక్రమంలో యూటీఎఫ్ పేట మండల శాఖ అధ్యక్ష, కార్యదర్శులు జి.పల్లవి, జి.ముక్తేశ్వరరావు, జిల్లా కౌన్సిల్ సభ్యులు ఎ.నరసింహారావు, కార్యవర్గ సభ్యులు పి.లక్ష్మణరావు పాల్గొన్నారు.

బీజేపీ పాలనలో రైతుల పరిస్థితి దయనీయం

రైతుసంఘం జిల్లా కార్యదర్శి ఆంజనేయులు



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

నందిగామ: దేశంలో బీజేపీ పాలనలో రైతుల పరిస్థితి దయనీయంగా మారిందని రైతుసంఘం జిల్లా కార్యదర్శి పీవీ ఆంజనేయులు మండిపడ్డారు. పట్టణంలోని సుందరయ్య భవన్‌లో ఆదివారం రైతు, కౌలురైతు సంఘాల ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఈనెల 27, 28 తేదీల్లో విజయవాడలో జరగనున్న మహాధర్నాకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ దేశంలో బీజేపీ తొమ్మిదేళ్ల పాలనలో వ్యవసాయం నిర్లక్ష్యానికి గురైందన్నారు. దీంతో రైతుల ఆత్మహత్యలు పెరిగాయన్నారు. దేశంలో ప్రభుత్వ రంగ సంస్థలను తెగనమ్ముతూ కార్మిక చట్టాన్ని పెట్టుబడిదారులకు అనుకూలంగా మార్చి కార్మికుల పొట్ట కొడుతున్నారని విమర్శించారు. కార్యక్రమంలో చనుమోలు సైదులు, శ్రీనివాసరావు, వీరరాఘవయ్య, ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఇందిరాగాంధీ జయంతి వేడుకలు



పేటలో ఇందిరాగాంధీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

జగ్గయ్యపేట అర్బన్: స్థానిక కాంగ్రెస్‌పార్టీ కార్యాలయంలో మాజీ ప్రధాని దివంగత ఇందిరాగాంధీ జయంతి వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ఇందిరానగర్, హరిజనవాడ లోని ఇందిరా గాంధీ విగ్రహాలకు ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు దాచేపల్లి వీరభద్రరావు, బ్లాక్–1 అధ్యక్షుడు సన్నె రామారావు తదితర నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేశానికి ఇందిరాగాంధీ చేసిన సేవలను కొనియాడారు. ఇందిరా గాంధీకి నివాళులర్పించిన వారిలో పారా రామారావు, ఎస్‌డీ ఖాజా, రేపూరి శ్రీను ఉన్నారు.

రజక ఆత్మగౌరవ మహాసభను విజయవంతం చేయాలి

మైలవరం: ఈ నెల 26న గుంటూరు సమీపంలోని ఆచార్య నాగార్జున యూనివర్సిటీ వద్ద జరిగే రజక ఆత్మగౌరవ మహాసభను విజయవంతం చేయాలని రాష్ట్ర రజక సంఘం అధ్యక్షులు బుద్దవరపు వెంకట్రావు తెలిపారు. మైలవరం రజక సంఘం కార్యాలయంలో ఆదివారం జరిగిన సమావేశంలో వెంకట్రావు మాట్లాడుతూ సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా రజకులకు రానున్న ఎన్నికల్లో రాజకీయ ప్రాతినిధ్యం కల్పించాలని డిమాండ్ చేశారు. రజక ఆత్మగౌరవ మహాసభను విజయవంతం చేయాలని కోరుతూ మైలవరం మండలం చంద్రగూడెం, మైలవరం, గ్రామాల్లో శనివారం, ఆదివారం రజక కార్యకర్తలతో పోస్టర్ ఆవిష్కరించారు. రాజకీయ పార్టీలకు అతీతంగా రాష్ట్ర వ్యాప్తంగా లక్ష మంది రజకులతో రజక ఆత్మగౌరవ మహాసభ నిర్వహించనున్నట్లు వెంకట్రావు తెలిపారు. రజకులకు గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు ఉన్న నామినేటెడ్ పోస్టులలో అవకాశం కల్పించాలని, ఎస్సీ జాబితాలో చేర్చాలని, రజకుల రక్షణ చట్టం అమలు చేయాలని కోరారు. మైలవరం నియోజకవర్గ రజక సంఘం అధ్యక్షుడు తాళ్లూరి శేషగిరిరావు, గవ్వలపల్లి చంద్రశేఖర్, చెన్నారావు పాల్గొన్నారు.